# కొత్త రచయితలు

"మాస్టారూ—"

పోస్టాఫీసులోంచి బయటకొస్తున్న సాజన్ ప్రక్కకు చూశాడు.

సాధన.

తను పి.జి. చేసే రోజుల్లో ట్యూషన్ తీసుకున్న డిగ్రీ స్టూడెంట్.

"మాస్టారూ! కథా...?" అతడి చేతిలో బ్రౌన్ కవర్ చూసి అడిగింది సాధన.

"జీవితం" నవ్వాడు సాజన్.

అర్థంకానట్టు చూసింది సాధన.

"అదే... ఉద్యోగానికి దరఖాస్తు..." ఈ మాట అంటున్నప్పుడు అతడి మొహంలో లీలగా విషాదం లాంటి అనీజీ భావమేదో గమనించింది సాధన.

"ఏంటి ఇలా వచ్చావ్..." అడిగాడు సాజన్.

"సేవింగ్స్ సర్టిఫికెట్ తీసుకుందామని..." జవాబిచ్చింది సాధన.

"అప్పుడే సేవింగా... ఏం చేస్తున్నావేంటి..." అడిగాడు.

"స్కూల్ టీచర్" చెప్పింది.

"గుడ్... వెరీగుడ్..." హర్షం వ్యక్తం చేశాడే కాని అతడి మొహంలో భావం మారింది.

దానికామె ఇంకో రకంగా రెస్పాండ్ అయ్యింది — "సారీ మాస్టారూ... మీకిచ్చిన ప్రామిస్ మిస్ చేశాను. మార్కులు తక్కువయ్యి పి.జి.లో సీటురాక బి.ఇడి. చేశాను. తరువాత ఈ నిరుద్యోగం."

"బావుంది... నాలా నిరుద్యోగం కంటే మంచిదేగా..." నవ్వాడు సాజన్.

ఆమె మాట్లాడలేదు. అతడి వేపు అర్థంకానట్టు చూసింది.

"ఇంటికేనా... పద బస్టాపు వరకూ వస్తాను" మాట మార్చాడు.

"లేదు... వెహికల్ వుంది..." పార్కింగ్‌లో వున్న లూనా చూపింది సాధన.

సాజన్ మొహంలో భావం మారింది. ఆమె వెహికల్ తీసుకు రాటానికెళ్లి తిరిగి వచ్చేసరికి మళ్ళీ యాంత్రికంగా తయారైపోయి "ఓ.కె. దెన్... మళ్లీ కలుద్దాం..." వెళ్ళబోయాడు.

"పదండి మీరు యూనివర్సిటీ వరకూ వస్తే నేను అక్కడి నుండి వెళ్ళిపోతాను" వెహికల్ అతడి చేతికివ్వబోయింది సాధన.

"లేదు... ఈ ప్రక్కనో ఫ్రెండుని కలవాలి..." చెప్పి ఆమె బయలుదేరి వెళ్ళాక బస్టాపు వైపు నడిచాడు సాజన్.

*　　*　　*

"మనం కలిసి వారం అవుతుందనుకుంటాను..." యూనివర్సిటీ క్యాంటీన్‌లో సాజన్‌తోపాటు కూర్చుని టీ తాగుతూ ఉపోద్ఘాతంగా అంది సాధన.

నవ్వేస్తూ, "ఎలా వుంది జాబ్..." అడిగాడు సాజన్.

"కొన్నాళ్ళు బేజారు తప్పించింది..." నవ్వింది సాధన.

"అంటే...?" భృకుటి ముడివేసాడు సాజన్.

"చదువైపోగానే మొగుడు పురుడు పెరడు... ఏదో పాటలోలా జీవితం అంత కాజువల్ అయిపోకుండా..." నవ్వింది సాధన.

"ఎప్పటికైనా తప్పదు కదా..." అతడూ నవ్వాడు.

"అనుకోండీ" అర్థోక్తిగా ఆగింది.

ఏదో అర్థమయినట్టుగా "ప్రత్యేక అభిప్రాయాలేమైనా..." ఆగాడు.

"ఉన్నాకాని అనువుకాని వేళ ఏ కాంతకైనా ఆ వాంఛ తగునా అంటూ హెచ్చరించారు త్యాగరాయ స్వామి."

******************

## సమతకోరి

కాగితాన కలము పెట్టి
అంతరాన్ని వెదకి తట్టి
గుండెలోన గూడుకట్టి —
నింగిపై కెగురు నట్టి
భావాలను కూడపెట్టి
మాటలలో దాచిపెట్టి
ఆవేశం మాలు ముట్టి
వెలుగు పూలమాల కట్టి,
కవితల దీపాలు పెట్టి —
నలువరాణి చలువ కోరి
పాదాలను పట్టు తాను —
నరులలోన సమతకోరి
పదములనే కట్టుతాను!

— పోతరాజు రామకృష్ణప్రసాద్

******************

"అంటే ఆ అభిప్రాయమేదో ఉన్నట్టేగా..."

"అదేం కాదులెండి.. అసలు ఏకపక్షే ఎడం, ద్విపక్షే దృఢం, త్రిపక్షే తథ్యం అన్నారెవరో. అంటే ప్రేమ అనే అభిప్రాయం ఒకరికే వుంటే అది దూరం చేసి ఉంచుతుంది. లేదూ.. ఇరువురికీ పరస్పరం ఆ అభిప్రాయం వుంటే అది దగ్గర చేసి బంధిస్తుంది. పోతే, మూడవ పక్షం వారైన అటు ఇటు పెద్దలకు కూడా ఆ అభిప్రాయం ఉచితంగా తోస్తే పెళ్లి జరిగి ప్రేమ ఫలిస్తుంది."

"బావుంది... ఎవరన్నారలా..." యథాలాపంగా అడిగాడు సాజన్.

"నా స్వంత భావం... బానే ఉందన్నమాట..." నవ్వింది సాధన.

"నువ్వు తెలుగు టీచరువా?" అడిగాడు.

"మారుపాళ్ల సైన్స్ టీచర్ని... కాకపోతే కవులతో తిరిగి ఏకలవ్యత్వంతో లవ్వుని గూర్చి తత్వం చెప్పానంతే..."

'కవులు' అన్నప్పుడు తన వేపు చూడటం సాజన్‌ని పులకింపజేసింది. దాన్ని దాచేస్తూ "ఇంతకీ నీది ఏకపక్షమా ద్విపక్షమా త్రిపక్షమా?" అడిగాడు.

"ఏదీ ఇంకా ఆదిలోనే వుంది" నవ్వింది సాధన.

"ఇంకా ఆదిలోనే? అందానికి అందం ఈ పుత్తడిబొమ్మ అన్న ట్లుండి ఆడుతు పాడుతు పని చేస్తుంటే అలుపు సొలుపేమున్నదిలా టీచర్ ఉద్యోగం... అందం ప్లస్ ధనం... నిన్ను వదులుకుంటున్న ఆ ప్రవరాఖ్యుడెవరు?"

"నేను వరూధునిని కానులెండి. ఏదీ ఇంకా నా మనసు అతడి ముందు బయట పెట్టందే...!"

"అంత మనసైనపుడు దాచుకోవటం ఎందుకు?"

"దోచుకున్నవారికి నా మనసును దోసిలిపట్టి ఇద్దామంటే అంత వెసులుబాటు లేకపోవటంతో అలుసుగా తీసుకుంటారేమోనని..."

"అలుసా... అసలు నీకేం తక్కువని...?"

"ఎక్కువ అనుకుందుక్కూడా ఏం లేదుకాని..."

"కాని..."

"ధైర్యం చేసి నా ప్రేమను వెల్లడిద్దామంటే ప్రస్తుతం ఆయనున్న

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్

# ఆలంబన



పరిస్థితిని అడ్వాంటేజ్‌గా తీసుకుంటున్నానని అపార్థం చేసుకుంటారేమోనని...''

''అడ్వాంటేజేమిటి...?''

''అది... నేను ఉద్యోగినివ్వటమే...''

''మరి అతను...?''

సాధన మౌనం వహించటంతో సాజన్‌కి అర్థమయింది.

''చూడు సాధనా... సర్టెన్ ఏంబిషన్స్ అంటూ లేకపోతే ఎవరైనా ఏదో ఒక పనిలో ఇమిడిపోతారు. అలా ఇమడలేని వాళ్ళు వాళ్ళ ఊహల్ని నిజం చేసుకునే ప్రయత్నంలో ఎక్కువ కాలం ఖాళీగా వున్నట్టు అనిపిస్తారు. సో... తనకేమైనా ఏంబిషన్స్ వున్నాయేమో తెలుసుకో...''

''సంకల్పం వుంటే మాత్రం అది సఫలం అయ్యేంతవరకూ సంకుచితంగా మంకుపట్టు పట్టుకు నిరుద్యోగిలా కూర్చోవాలా.. అందాకా దొరికిందేదైనా...'' సాధనను పూర్తి చెయ్యనీకుండానే ఆవేశపడ్డాడు సాజన్.

''ఏదో సాధిద్దామనే ఒక సంకల్పంతో ఆ ఆశయసిద్ధి కోసం అనునిత్యం యుద్ధం చేసేవాళ్ళను నిరుద్యోగులని ఎలా అంటావ్...? వాళ్ళ ప్రయత్నంలో వాళ్ళు బిజీగా వర్క్ చేస్తున్నట్లే కదా... వాళ్ళని వాళ్ళ దారిలో ప్రోత్సహించకుండా ఇలా డిప్రెస్ చేసి వాళ్ళ ధ్యేయాన్ని డ్రాప్ చెయ్యాలనుకోవటం...'' ఆపై మాట్లాడేందుకు ఆవేశం అడ్డొచ్చి ఆగిపోయాడు సాజన్.

అతడిని ఆగనిచ్చి అందుకుందామె — ''అంటే మీ ధ్యేయం మీకు న్యాయమే అనిపిస్తున్నప్పుడు ఆ రోజు నేను చిరుద్యోగం అన్నప్పుడు మీరు 'నాలా నిరుద్యోగం కంటే మంచిదేగా' అంటూ మిమ్మల్ని మీరు తక్కువ చేసుకోవటంలో అర్థముందా చెప్పండి...''

కొద్దిసేపు అతడేం మాట్లాడలేకపోయాడు.

తన ధ్యేయం వైపు ఉద్యమంలా వెళ్ళవలసిన తను మధ్యలో నిరుద్యోగం అంటూ నిరుత్సాహంతో చేతులు ముడుచుకు కూర్చున్న తన చేతలను సమర్థించుకుంటూ కాలయాపన చేస్తున్న విషయం ఆమె హెచ్చరిస్తున్నట్టుగా అయింది. దాంతో అతడి మొహం మ్లానమయింది.

సాజన్‌లోని ఆ భావం చూసి ''సారీ... ఇదంతా మిమ్మల్ని బాధపెట్టాలని కాదు...'' భయపడుతూనే అంది సాధన.

సాజన్ మాట్లాడలేదు. కాని, ఆ మాటల్లో అంతసేపు వాళ్ళ సంభాషణలో ఆమె ప్రేమ పేరుతో ఎవరినో ఉద్దేశించి మాట్లాడింది తన కోసమే అనేది అర్థమయింది.

తన అంతరంగం అతడికి అర్థమయిందని అర్థమయిన సాధన మెల్లగా అంది ''మీరు మొన్న అప్లయ్ చేసింది యుపియస్సీకేగా... ఓ యేడాది పాటు కోచింగ్‌కి ఢిల్లీ వెళ్ళాలనుకుంటే...''

అతడికి ఆమె ఉద్దేశం అర్థమయింది. ఏ భావమూ లేకుండా ఆమె వేపు చూశాడు.

''మీరిలా ఉండిపోవద్దండి... మీకంటూ ఒక మంచి పొజిషన్ ఏర్పడాలి... ఎప్పటికైనా మీరో ఉన్నత స్థితిలో వుంటే ఆనందించేవాళ్ళలో మొదటిదాన్ని నేను.. మీ ఇబ్బంది నాకు తెలుసు... మిమ్మల్ని మీ ఆశయం వేపు నడిపించే అవకాశం నాకివ్వండి... కనీసం అప్పుగా తీసుకునైనా'' ఆశగా అడిగింది సాధన.

సాజన్ మాట్లాడలేదు. కాని, తన ఆశయసిద్ధికి ఆశ చూపుతున్న సాధనను నిరాశ పరచకూడదని మాత్రం నిర్ణయించుకున్నాడు.

రచయిత చిరునామా:
శాంతా సూరపు
21-2, నేతాజీ స్ట్రీట్
నరసన్నపేట - 532 421